ప్రతిపాదనలకే పరిమితం!

- మూడున్నర దశాబ్దాలుగా కలగా ఇండోర్ స్టేడియం నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న క్రీడాకారులు



మట్టిలో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు

గుత్తి: గుత్తిలో ఇండోర్ స్టేడియం నిర్మాణం మూడున్నర దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమైంది. దీంతో షటిల్ క్రీడాకారులు రేకుల షెడ్లు, మట్టి కోర్టుల్లో ఆడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎన్నాళ్లు ఇలా మట్టి, గాలి, షెడ్లలో ఆడాలని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. గుత్తి మున్సిపాలిటీగా రూపాంతరం చెంది 14 సంవత్సరాలైంది. పంచాయతీ ఉన్న సమయం నుంచి ఇప్పటి వరకు ఇండోర్ స్టేడియం కాగితాలకే పరిమితమైంది. గుత్తిలో ఇండోర్ గేమ్స్ ఆడేవారు వందలాది మంది క్రీడాకారులు ఉన్నారు. స్టేడియం లేకపోవడంతో షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ తదితర ఇండోర్ గేమ్స్ ఆడేవారు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని అన్ని నగర పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఇండోర్ స్టేడియాలు ఉన్నాయి. అయితే గుత్తిలో మాత్రమే ఇండోర్ స్టేడియం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఇండోర్ స్టేడియం నిర్మించాలని క్రీడాకారులతో పాటు మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

ఇండోర్ స్టేడియం వల్ల ఉపయోగాలు

ఇండోర్ స్టేడియం నిర్మిస్తే క్రీడాకారులకు ఉపయోగంగా ఉంటుంది. ఇండోర్ స్టేడియంలో షటిల్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ తదితర క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రత్యేక విభాగాలుంటాయి. పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, డ్రెస్సింగ్ రూమ్స్, విశ్రాంతి గదులు అందుబాటులో ఉంటాయి. అలాగే రాష్ట్ర, జిల్లాస్థాయి ఇండోర్ క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో క్రీడా చైతన్యం పెరగనుంది.

ఎన్నాళ్లు మట్టిలో ఆడాలి?



సుమారు 15 ఏళ్లగా షటిల్ ఆడుతున్నాను. మట్టి, ఎండ, గాలిలో ఆడాల్సి వస్తోంది. వాన వచ్చినా, గాలి అధికంగా వీచినా ఆ రోజు ఆటకు సెలవే. దీంతో షటిల్ క్రీడాకారులందరం ట్రాన్స్‌కో అధికారుల సహకారంతో షెడ్డు వేసుకుని షటిల్ ఆడుతున్నాం.

–ఇస్మాయిల్, షటిల్ క్రీడాకారుడు, గుత్తి

ఇండోర్ స్టేడియం నిర్మించాలి



ఇండోర్ స్టేడియం లేక షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నాం. ఇండోర్ స్టేడియం ప్రతిపాదనలకే పరిమితమైంది. సంబంధిత అధికారులు స్పందించి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

–ఖాజా, షటిల్ క్రీడాకారుడు, గుత్తి ఆర్ఎస్

ఇబ్బందులు తొలగించాలి



ఇండోర్ స్టేడియం లేక క్రీడాకారుల ఇబ్బందులు పడుతున్నాం. గుత్తిలో వందలాది మంది క్రీడాకారులు ఉన్నారు. అయితే ఇండోర్ స్టేడియం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

–రవి, షటిల్ క్రీడాకారుడు, గుత్తి

మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం



ఇండోర్ స్టేడియం నిర్మాణానికి గతంలోనే స్థలాల పరిశీలన పూర్తయింది. సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయింది. త్వరలోనే ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఉన్నతాధికారులకు మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం.

–జబ్బార్‌మియా, మున్సిపల్ కమిషనర్

'స్వచ్ఛ గుత్తి' కోసం కృషి చేయాలి

గుత్తి: స్వచ్ఛ గుత్తి కోసం కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం మార్గ దర్శకాలు, అమలుపై మున్సిపల్, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత , పరిసరాల పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 15న పట్టణ పరిశుభ్రత కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రైతులకు ఐడీ నంబర్ల నమోదు



కల్లుమడి రైతు సేవా కేంద్రంలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న దృశ్యం

శింగనమల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పట్టాదారు పాసు పుస్తకం కలిగిన ప్రతి రైతు ఒక ఐడీ నంబరు కలిగి ఉండాలని, అందుకోసం రైతుల వివరాలు నమోదు చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్ తెలిపారు. సోమవారం కల్లుమడి రైతు సేవా కేంద్రంలో రైతుల వివరాలు నమోదు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఐడీ పంట నమోదు, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, రాయితీ విత్తనం లబ్ధి, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తుల అమ్మకాలకు ఉపయోగపడుతుందన్నారు. ఆధార్ నంబరు మాదిరిగా ప్రతి రైతుకూ ఐడీ కార్డు ఉంటుందన్నారు. అందుకోసం పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సులు, ఫోన్ నంబర్‌ను రైతు సేవా కేంద్రంలో అందజేయాలన్నారు.

క్లుప్తంగా

అశ్వత్థంలో హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న అధికారులు, గ్రామపెద్దలు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో మాఘమాసం రెండో ఆదివారం తిరునాల సందర్భంగా భక్తులు సమర్పించిన హుండీ కానుకలను సోమవారం దేవదాయ స్పెషలాఫీసర్ వన్నూరుస్వామి, ఈఓ సుబ్రమణ్యం నేతృత్వంలో లెక్కించారు. తాత్కాలిక హుండీల ద్వారా రూ.6,14,898, పర్మినెంటు హుండీల ద్వారా రూ.3,96,817, శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,73,450, తలనీలాల టికెట్ల ద్వారా రూ.17,650, విరాళాలు రూ.15499లు, అభిషేకం టికెట్ల ద్వారా రూ.1000 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు

నివాళి

యాడికి: మండలంలోని నిట్టూరులో అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామాంజనేయులు మృతదేహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, మాజీ కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, నగరూరు సర్పంచు రుక్మాంద రెడ్డి, యాడికి ఉప సర్పంచు కాసా చంద్ర మోహన్, రామాంజనేయులు రెడ్డి, చలపతి రెడ్డి, అశోక్ రెడ్డి, గుడిపాడు దండు రాముడు, తాడిపత్రి మాజీ మునిసిపల్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, పేరం గోకుల్‌నాథ రెడ్డి, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పెంచిన రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించాలి



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రిజిస్ట్రేషన్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గించాలని సోమవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. అలాగే రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వేరే ప్రాంతానికి మార్చకుండా ఇక్కడే కొనసాగించాలని సబ్ రిజిస్ట్రార్ షమీర్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రశేఖర్, రామునాయక్, షబ్బీర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారి ప్రసాద్

గుత్తి రూరల్: రోడ్డు భద్రత నియమాలపై ప్రతి విద్యార్థీ అవగాహన కలిగి ఉండాలని ఆర్టీసీ అధికారులు ప్రసాద్, గోపాల్ సూచించారు. మండలంలోని తొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రోడ్డు భద్రత మాసోత్సవాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు రోడ్లపై ప్రయాణం చేసేప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. బస్సులో ప్రయాణం చేసే సమయంలో చేతులు, తల బయట పెట్టరాదన్నారు. బస్సులో ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదకరమన్నారు. ఆర్టీసీ బస్సులలోని పరికరాలు, కిటికీ అద్దాలు, సీట్లను ధ్వంసం చేయరాదన్నారు. 18 సంవత్సరాలు పూర్తి అయ్యాక లైసెన్స్ తీసుకొని ద్విచక్రవాహనాలను నడపాలని సూచించారు. తప్పకుండా హెల్మెట్ ధరించి బైక్ నడపాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వాత్సవరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్‌గౌడ్, శ్రీనివాసరావు, భారతి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

శింగనమల: మండలంలో ఉపాధి పనులు లేక కూలీలు వలసలు పోతున్నారని , వెంటనే పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ సంవత్సరంలో 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం అందించాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు గడ్డ పార, గుణపం, గంప, మెడికల్ కిట్ , నీడకు పనికి వచ్చే పట్టలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ రెండు సెంట్ల స్థలమివ్వాలి



సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: అర్హత ఉన్న పేదలందరికీ రెండు సెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు పక్కా గృహాన్ని నిర్మించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. గుత్తిలో మండల సీపీఐ కార్యదర్శి రామదాస్, పట్టణ కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో సోమవారం మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడారు. హౌసింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ లోపాలను వెంటనే సరి చేయాలన్నారు. టిడ్కో ఇళ్ల సమస్యను పరిష్కారం చేయాలన్నారు. ఎన్నికల సమయంలో పేదలకు కూటమి నాయకులు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్ర స్వామి, పట్టణ కార్యదర్శి రాజు, సీనియర్ నాయకుడు సూర్యనారాయణరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి, నియోజకవర్గం సహాయ కార్యదర్శి మముదా, మాబ్బీ, నియోజకవర్గ సహాయ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివస్వాములు గ్రామోత్సవం





పెద్దవడుగూరు: శివస్వాముల గ్రామోత్సవ దృశ్యం , శింగనమల: అలంకరణలో శివుడు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో సోమవారం శివ దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో శివస్వాముల గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శివమాల దారులు ఉదయం నుంచి శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శివలింగాన్ని ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కాయ కర్పూరాలు సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో శివ మాలధారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దోణరామేశ్వరాలయంలో మాఘమాసం పూజలు

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం గ్రామ సమీపంలోని దొణరామేశ్వరాలయంలో మాఘమాసం పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దొణరామేశ్వరుడికి అభిషేకం చేసి, పూలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శింగనమల, చిన్నజలాలపురం, గురుగుంట్ల, నర్సాపురం, గార్లదిన్నె, అనంతపురం, ధర్మవరం నుంచి భక్తులు తరలివచ్చారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

శింగనమల: విజయవాడలో ఈనెల 9న విశ్వం ఎడ్యుటెక్ సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అ బాకస్ పోటీలలో శింగనమల ఏఎస్ఆర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కరెస్పాండెంట్ ఆంజనేయరెడ్డి సోమవారం తెలిపారు. స్టార్ జూనియర్స్ విభాగంలో రెండో తరగతి విద్యార్థి భాగ్యోదయ స్టార్ చాంపియన్ షిప్ సాధించారన్నారు. సీనియర్ విజువలైజేషన్ విభాగంలో ఐదో తరగతి విద్యార్థి రవి వరణ్ కన్సలేషన్ ప్రైజ్ సాధించారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లితండ్రులు అభినందించారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

పామిడి: మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలో సోమవారం ఏఓ డీ లీనా వసుంధర ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. క్వింటాల్ కందులు రూ.7500లు చొప్పున మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేస్తారన్నారు. వివరాలకు సంబంధిత రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కే సుశీలమ్మ, వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ ముసలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటీకి ట్యాలెంట్ విజనరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్ఆర్ఐటీ కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలకు ట్యాలెంట్ విజనరీ అవార్డు–2025 లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ సోమవారం తెలిపారు. ఎస్ఆర్ఐటీ కళాశాలలో 350 మంది విద్యార్థులు సేల్స్ ఫోర్స్ వర్చువల్ ఇంటర్న్‌షిప్ పోగ్రాం, ప్రాజెక్ట్ రెడీ టాలెంట్ పోల్స్ పోగ్రాంను పూర్తి చేశారన్నారు. ఇందుకు సేల్స్ ఫోర్స్ కంపెనీ తరఫున ఎస్ఆర్ఐటీ కళాశాలకు టాలెంట్ విజనరీ అవార్డు–2025ను బెంగుళూరులో జరిగిన సదస్సులో ప్రదానం చేశారన్నారు. సేల్స్ ఇంటర్న్‌షిప్ పోగ్రాం కస్టమర్ రిలేషన్ షిప్ మేనేజ్‌మెంట్ ప్రాసెస్ ఆటోమేషన్ వర్క్ ఫ్లో అనే అంశాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అవార్డును కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఐఐఐ సెల్, కన్వీనర్ డాక్టర్ హేమంత్ కుమార్ యాదవ్, కో–కన్వీనర్ కొండన్న, అందుకున్నారు.

ఆర్థిక నేరాలపై అవగాహన



తాడిపత్రిలో మాట్లాడుతున్న సీఐ సాయిప్రసాద్



యాడికిలో మాట్లాడుతున్న ఏఎస్ఐ వెంకటేష్

తాడిపత్రి రూరల్: ఆర్థిక నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ సాయిప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని రావివెంకటాంపల్లి వద్ద ఉన్న సర్ సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఆర్థిక నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్టులు, ఫేక్ లోన్ యాప్‌లు, షేర్ మార్కెట్ మోసాలు, కొరియర్ ఫ్రాడ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా వచ్చే ఫోన్ కాల్స్ తదితర వాటి గురించి సీఐ క్షుణ్ణంగా వివరించారు. సైబర్ వలంటీర్లుగా ఉండేందుకు విద్యార్థులు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలో ప్రొజెక్టర్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందూధర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యాడికి: సైబర్ నేరాలపై ప్రతి ఒకకరూ అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ వెంకటేష్ సూచించారు. సోమవారం స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజుకో ఆలోచనతో ప్రజల్ని బురిడీ కొట్టిస్తున్నారన్నారు. ఓ సారి పోలీసులమని, మరోసారి అధికారులమని ఫోను చేసి బ్యాంకు ఖాతాల్లోని నగదును ఖాళీ చేస్తున్నారన్నారు. ప్రజలను చైతన్యపరిచేందుకు ప్రతి విద్యార్థీ సైబర్ వలంటీర్‌గా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు రామాంజనేయులు రెడ్డి, షాషావలి పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, రేషన్ షాపుల్లో అన్ని రకాల సరుకులను పంపిణీ చేయాలని కోరుతూ ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలను వెంటనే నియంత్రించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తృత పరచాలని, రేషన్ షాపుల్లో 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని కోరారు. ఎల్పీజీ సిలిండర్లకు సబ్సిడీని అందించాలని, ఏడాదికి ప్రతి ఇంటికీ 12 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయాలని కోరారు.

'భూ సమస్య పరిష్కరించాలి'

భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గుంతకల్లు పట్టణంలోని పాత గుంతకల్లుకు చెందిన చిన్న నారాయణ సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశాడు. తనకున్న భూమిని ముగ్గురు కుమారులకు సమానంగా పంచానని, కానీ రెండో కుమారుడు నాగలింగ తన వాటా భూమిని అమ్ముకొని ఇప్పుడు వాటాలే పంచలేదంటూ సమస్యలు సృష్టిస్తున్నాడన్నాడు. రికార్డులను పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరాడు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె



కమిషనర్‌కు నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 22 తరువాత సమ్మెబాట పడుతామని సీఐటీయూ, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శులు సాకే నాగరాజు, ఈశ్వరయ్య హెచ్చరించారు. సోమవారం కమిషనర్ నయీమ్‌అహ్మద్‌ను కార్మిక సంఘాల నాయకులు కలిసి సమ్మె నోటీసు అందజేశారు. కార్మికుల బకాయిలను చెల్లించాలని, రిటైర్డ్ అయిన, మరణించిన పారిశుద్ధ్య కార్మిక కుటుంబసభ్యులకు ఉద్యోగమివ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఏపీజీఎల్ఐ మొత్తాన్ని చెల్లించాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులకు పని ముట్లు, యూనిఫాంను అందజేయడంతో పాటు అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించకపోతే వివిధ రూపాల్లో నిరసనలు తెలిపి 22 తరువాత సమ్మెలోకి వెళ్తామన్నారు. కార్మిక సంఘాల నాయకులు నరసయ్య, తిరుపాల్, చిన్నయ్య, హనుమంతు, రమేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు, పెద్దయక్కలూరు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఈ నెల 12న చిన్నపప్పూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, 13వ తేదీ పెద్దయక్కలూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ నరసింహులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలన్నారు.

నడిరోడ్డుపై చెడిపోయిన లారీ

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద సోమవారం నడి రోడ్డుపై ఓ లారీ చెడిపోయింది. సుమారు గంటన్నర పాటు లారీ ముందుకు కదలలేదు. దీంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. బ్యాటరీ డౌన్ కావడం వల్ల లారీ నిలిచిపోయింది. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసులు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు గంటన్నత తర్వాత లారీని మరమ్మతులు చేసి ముందుకు తీసుకెళ్లారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిని పలు సమస్యలపై వామ పక్షపక్ష పార్టీల నేతలు నిలదీశారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. రైతులకు 100 శాతం రాయితీతో డ్రిప్పు స్ప్రింక్లర్లు అందజేయాలన్నారు. బీకేఎస్‌లో ఎర్రమట్టి, ఇసుక మాఫియా అరికట్టాలాన్నారు. జగనన్న కాలనీలలో మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. దండువారిపల్లిలో చెరువుకు సాగునీరు విడుదల చేయాలని సీపీఐ నియోజక వర్గం కార్యదర్శి నారాయణస్వామి నిలదీశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, హరిక్రిష్ణ, రామక్రిష్ణ, శివారెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ పంపిణీ



శింగనమలలో విద్యార్థినికి అల్బెండజోల్ మాత్రను మింగిస్తున్న వైద్యాధికారి శంకర్ నాయక్

తాడిపత్రి అర్బన్/శింగనమల/గార్లదిన్నె/గుత్తిరూరల్/యల్లనూరు: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. తాడిపత్రిలోని ప్రకాశం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నులిపురుగుల నివారణ దినోత్సవంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగరాజు, ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు, వైద్యధికారి శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే శింగనమల జెడ్పీహైస్కూల్లో విద్యార్థులకు మండల వైద్యాధికారి శంకర్‌నాయక్ ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.అనంతరం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అదేవిధంగా గార్లదిన్నె మండలంలో 10,977 మందికి గాను 10,889 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యర్రగుంట్ల పీహెచ్‌సీ డాక్టర్ దిలీప్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు గురుకుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే గుత్తి మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలను బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, దేవేంద్రనాయక్ పంపిణీ చేశారు. అదేవిధంగా యల్లనూరు మండలంలోని యల్లనూరు, తిమ్మంపల్లి పీహెచ్‌సీల పరిధిలోని జెడ్పీ హైస్కూల్లో యల్లనూరు, తిమ్మంపల్లి, వెన్నపూసపల్లి, కూచివారిపల్లి, కస్తూర్బావిద్యాలయం, ఆదర్శ పాఠశాల, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్యులు కీర్తన, లోకేష్‌కుమార్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మధు, సూపర్‌వైజర్లు రాము, హాజీవలి, ఏఎన్ఎంలు శ్రీదేవి, గౌరీ, ప్రమీల పాల్గొన్నారు.